# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 01 ఆగస్టు , 2025 | పేజీలు : 06





నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

# నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

### రూ. 40 కోట్ల వ్యయంతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ నల్లగొండ :** మంచి విద్యనందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో రూ. 40 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనానికి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, అందువల్ల విద్యార్థులు బాగా చదువుకోవాలని అన్నారు. ప్రస్తుతం మహిళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలో రెండు రోజుల్లో తాగునీటి ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ,నెల రోజుల్లో ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో బాత్రూంలు, ఇతర సౌకర్యాలన్నీ కల్పిస్తామని తెలిపారు. కేరళలో 99.9 అక్షరాస్యత ఉండగా, మన రాష్ట్రంలో 60 శాతం ఉందని , విద్య, నైపుణ్యాలు పెంపొందింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీతో పాటు, అన్ని రకాల విద్యా సదుపాయాలు కల్పిస్తున్నదని అన్నారు. నర్సింగ్ విద్యార్థులు చదువు పైన దృష్టి సారించాలని, సెల్ ఫోన్ జోలికి వెళ్ళవద్దని, ప్రజలకు మంచి సేవలు అందించాలని, సమయాన్ని వృధా చేసుకోవద్దని అన్నారు. ఈ నెల 4 న ప్రభుత్వ వైద్య కళాశాల పక్కనే 150 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాటశాల పనులకు భూమి పూజ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నర్సింగ్ కోర్స్ చాలా ఉత్తమమైనదని, వైద్యరంగంలో నర్సింగ్ అనేది మొదటి అడుగు అని అన్నారు. రోగులు ముందు గా స్టాఫ్ నర్స్ ని సంప్రదిస్తారని, డాక్టర్ కన్నా స్టాఫ్ నర్స్ ముఖ్యమని, రోగి ప్రాణాలు కాపాడటంలో స్టాఫ్ నర్స్ పాత్ర ఎంతో ఉంటుందని అన్నారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి తదితరులు ఉన్నారు.

**వైద్య పరికరాలు, సౌకర్యాలకు ప్రతిపాదనలను తక్షణమే రూపొందించాలి**

ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని అన్ని విభాగాలలో అవసరమైన వైద్య పరికరాలు, సౌకర్యాలను కల్పిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఇందుకుగాను అవసరమైన ప్రతిపాదనలను తక్షణమే రూపొందించి సమర్పించాల్సిందిగా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.గురువారం ఆయన పభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అభివృద్ధిపరిచిన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ఛాంబర్ లో ఆసుపత్రి వైద్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జిల్లాలో వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రసవం తర్వాత తల్లికి,బిడ్డకు పనికి వచ్చేలా ఎం సి హెచ్ కిట్లను అందించేందుకు అన్ని వస్తువులతో కిట్లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా అవసరమైన సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. ఖాళీగా ఉన్న ఫిజీషియన్, సర్జన్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.



## నీటిని విడుదల చేయాలని రైతుల రాస్తారోకో

**ప్రజా పక్షం/ (తిప్పర్తి) నల్లగొండ :** తిప్పర్తి మండలంలో డి39, డి40 కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని మాజీ జెడ్‌పిటిసి తండు సైదులు గౌడ్,బిఆర్ఎస్ నాయకులు కందుల లక్ష్మయ్యలు డిమాండ్ చేశారు. గురువారం నీటిని విడుదల చేసి ఏఎంఆర్‌పి కాలువలకు తక్షణమే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తిప్పర్తి మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు, రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగార్జునసాగర్ నుండి 26 గేట్ల ద్వారా నీళ్లు పోతున్నప్పటికీ, జిల్లా మంత్రులు, శాసనసభ్యులు కనీసం అవగాహన లేకుండా నల్లగొండ జిల్లాను దూరం పెడుతున్నారని ఉదయ సముద్రం 1.5 టిఎంసి పూర్తిస్థాయిలో నింపి ఆయకట్టు పరిధిలోని అన్ని చెరువుల నింపి, రైతులకు పంటల కోసం నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మన్నెం బిక్షం, రైతులు గుండెబోయిన రామచంద్ర, గుండేబోయిన సైదులు, రొట్టెల జానయ్య, దేవి రెడ్డి లింగారెడ్డి, చింతకుంట్ల దయాకర్ రెడ్డి, నూకల ప్రవీణ్, రావుల సందీప్, నూకల రాజీవ్, బైరగోని శ్రీను జాకటి బాలయ్య, కట్ట కిట్టు, గుండు రవి, జానీ పాషా, కస్పరాజు వెంకన్న, రొట్టెల సైదులు, మర్రి వెంకన్న, దేవిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్‌పి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నేరం జరిగిన ప్రదేశంలో నమూనాలను సేకరించి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నేర దర్యాప్తులో కచ్చితమైన ఫలితాలు సాధించవచ్చు అని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. జిల్లా క్లూస్ టీమ్ కి కేటాయించిన నూతన మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని జిల్లా ఎస్‌పి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రారంభించి మాట్లాడుతూ ఇక నుంచి నేరం జరిగిన ప్రదేశానికి క్లూస్ టీం త్వరితగతిన చేరుకొని,నేర నమూనాలను సేకరించుటకు నూతన సాంకేతిక టెక్నాలజీతో డి.ఎన్.ఎ.శాంపిల్ కలెక్షన్ కిట్, రక్త నమూనా , సేమన్ కలెక్షన్ కిట్, నార్కోటిక్ డిటెక్షన్ కిట్, పేలుడు పదార్థాల డిటెక్షన్ కిట్, ఎల్.ఈ.డీ. సెర్చ్ లైట్, గ్యాస్ డిటెక్టర్, నేర ఆధారాలను భద్ర పరచి ఫోరెన్సిక్ సేఫ్ డ్రాయింగ్ క్యాబినెట్ లాంటి అన్ని సదుపాయాలు ఈ వాహనంలో కలిగి ఉంటాయని అన్నారు. ఎప్పుడైన హత్యలు,మానభంగాలు, అనుమానస్పద మరణాలు, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, దొంగతనాలు జరిగినప్పుడు ఈ పరికరాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుంటూ నేర దర్యాప్తు విషయంలో కచ్చితమైన ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. అన్ని సదుపాయాలు ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనం లో ఉండడం వలన నేర పరిశోధన సులభతరం అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రమేష్ ఏ.ఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు డిసిఆర్‌బి సీఐ శ్రీను నాయక్,ఆర్‌ఐ లు సూరప్ప నాయుడు,సంతోష్,నరసింహ క్లూస్ టీమ్ ఇంచార్జి ఎస్‌ఐ శివ , సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రజలందరికీ ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** నార్కట్‌పల్లి పట్టణంలో గురిజ అశోక్ స్వామి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన దేవాలయంకు ఎమ్మెల్యే వీరేశం సతీసమేతంగా వచ్చి అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా అమ్మవారి ఆజ్ఞ మేరకు భక్తులకు వివిధ రకాల సేవలు అందిస్తున్న అశోక్‌స్వామి నూతన దేవాలయ నిర్మాణంతో భక్తులకు తమ ఇష్టదేవాన్ని ప్రత్యక్షంగా వేడుకనే అవకాశాన్ని కల్పించినందుకు సంతోషంగా ఉందన్నారు. మాజీ జెడ్పిటీసి దూదిమెట్ల సత్తయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య పాల్గొన్నారు.



## పేదలకు కడుపునిండా అన్నంపెట్టడమే లక్ష్యం

### అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందించడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ శాసనసభ్యుడు నేనావత్ బాలు నాయక్ అన్నారు.గురువారం ఉమ్మడి పీఏ పల్లి మండలం లోని అంగట్ పేట ఎక్స్ రోడ్డు సమీపంలో గల వైష్ణవి ఫంక్షన్ హాలులో నూతనంగా మంజూరు అయిన ఆహార భద్రత కార్డుల మంజూరి పత్రాలను అధికారులు నాయకులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద దరిద్ర రేఖ దిగువనున్న కుటుంబానికి కడుపు నిండా అన్నం పెట్టాలని ఉద్దేశంతోనే తెలంగాణ ప్రజా ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్నారు.ఇది నిరంతరంగా జరిగే ప్రక్రియని ఎవరూ కార్డు రాలేదని కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు.గత ప్రభుత్వ హాయంలో నాయకులు దోచుకున్నారే తప్ప అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ముందుగా గుడిపల్లి మండలంలోని కేశనేనిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇంద్రమ్మ గృహాలను పరిశీలించారు. 7బి ద్వారా పంట పొలాలకు సాగు నీరు అందించాలని గుడిపల్లి మండల కేంద్రంలో రైతులు ఎమ్మెల్యే ముందు నిరసన వ్యక్తం చేసి వినతి పత్రం అందజేశారు.





## బియ్యం అందజేత

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** మండలంలోని కామునిగూడెంకు చెందిన గౌడ సంఘం నాయకులు లోడి చిన్న పెంటయ్య గౌడ్, లోడి మల్లయ్య గౌడ్‌ల తల్లి లోడి లక్ష్మమ్మ ఇటీవల మృతి చెందగా కేజీకెఎస్ మండల గౌరవ అధ్యక్షులు గడ్డం దశరథ గౌడ్ వారి కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు పంజాల నరసయ్య గౌడ్, ఉపాధ్యక్షులు నాతి రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి బొడిగ వెంకన్న, డైరెక్టర్లు లోడి శీను గౌడ్, బూడిది నాగరాజు గౌడ్, మాజీ అధ్యక్షులు పొనగాని జహంగీర్ గౌడ్, దేవస్థాన చైర్మన్ గుండెగాని ఐలయ్య గౌడ్, రాగటి శ్రీను, లోడి పరశురాములు, లోడి శ్రీశైలం గౌడ్ వారి కుటుంబాన్ని పరామర్శించారు.

## శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పిచ్చిగడ్డి అధికంగా పెరిగి విద్యార్థులకు అసౌకర్యం ఉండగా శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో గడ్డి మందు పిచికారి చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మహాదేవ రెడ్డి, యువజన మండలి అధ్యక్షులు మజ్జిగ నరేశ్, ప్రధాన కార్యదర్శి తొండల అనిల్ కుమార్, మాజీ అధ్యక్షులు కోరే మల్లేశ్, యువజన మండలి సభ్యులు మురారిశెట్టి వెంకటేశ్వర్లు, మల్ల క్రాంతి, కోరే మహేష్, నాతి వినయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నీటి విడుదల కోసం వినతి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని పెండ్లీపాకుల రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరుతూ బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమావత్ దస్రునాయక్ నీటి పారుదల శాఖ ఈఈ నెహ్రూకు గుర్రంపోడులోని కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దస్రునాయక్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అండగా ఉండి సకాలంలో నీటిని విడుదల చేసి వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. పెండ్లీపాకుల రిజర్వాయర్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు తుకం పోసుకొని నీటి విడుదల కోసం ఎదురు చూస్తున్నారని తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులకు నీటిని విడుదల చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎటెల్లి రాంబాబు, మండల బావోజీల సంఘం కార్యదర్శి నానుబావోజి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## బిటి రోడ్లు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** పెద్దకాపర్తి నుంచి సిరిపురం వరకు వెలిమినేడు నుంచి సిరపురం మీదుగా తుమ్మలగూడెం వరకు బీటీరోడ్లు మంజూరు చేయాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు రాపోలు నరసింహా అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాతూ ధర్మాపురెడ్డిపల్లి పిలాయిపల్లి కాల్వ విషయంలో ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక చొరవ చూపి కాల్వ పనులు వేగంగా చేయించడం అభినందనీయమన్నారు. అదే విధంగా పిలాయిపల్లి కాల్వ నుంచి కేవలం 3 నుంచి 4 ఎకరాల భూసేకరణ చేసి ఫీడర్ చానెల్ ఏర్పాటు చేస్తే సిరిపురం నుంచి నిదాన్‌పల్లి గ్రామాల్లోని కుంటలు, చెరువులు నిండి వందల ఎకరాలు సాగులోకి వస్తాయని, ఈ గ్రామాల రైతులకు మేలు జరుగుతుందన్నారు. అదేవిధంగా ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న పెద్ద కాపర్తి నుంచి సిరిపురం, వెలిమనేడు నుంచి వయా సిరిపురం మీదుగా తుమ్మల గూడెం వరకు బీటీ రోడ్డు వేయించాలని గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లు మంజూరు చేయించాలన్నారు. అదే విధంగా గుంద్రపల్లి నుంచి వెల్లంకి వరకు మంజూరైన రోడ్డు పనులు మొదలు కావడం లేదని ఎమ్మెల్యే చొరవ చూపి పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మీర్జాఫజల్‌బేగ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు నకిరేకంటి గణేష్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పున్నా వెంకటేశం, చేనేత జిల్లా నాయకుడు గోశిక చక్రపాణి, మండల ఉపాధ్యక్షుడు బత్తుల సత్యం, నాయకులు పోచనబోయిన మల్లేశం, సాయిని శేఖర్, గాదె జాని, కట్ట మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల ఆత్మ రక్షణ కోసం కుంగ్ ఫూ, కరాటే

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ఇటీవలి కాలంలో అమ్మాయిలపై జరుగుతున్న దాడుల దృష్ట్యా ఆత్మరక్షణ కోసం కుంగ్ ఫూ, కరాటే చాలా అవసరమని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజయ్ భార్గవ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటి పరిధిలోని గాంధీ పార్క్ వద్ద గల ప్రతిభ వొకేషనల్ జూనియర్ కళాశాల, శ్రీ మేధ జూనియర్ కళాశాలలో విధ్యార్థినులకు గురువారం ఉచిత కుంగ్ ఫూ, కరాటే శిక్షణా కార్యక్రమాన్ని కుంగ్ ఫూ, కరాటే బ్లాక్ బెల్ట్ బొడ్డు పరమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి ఎస్ఐ హాజరై ప్రారంభించి మాట్లాడారు. విధ్యార్దులు సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్ లలో తమ వ్యక్తిగత సమాచారాన్ని ఉంచకూడదని



తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిలివేరు ధనలక్ష్మి, ప్రిన్సిపాల్ సిలివేరు శ్రీనివాస్, లింగస్వామి, రాజు, నిరంజన్, బాలక్రిష్ణ, రాజేష్, జ్యోతి, రజిత, నవ్య, జ్యోతి, భాగ్యలక్ష్మి, రాణి, విధ్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సూర్యాపేట, కోదాడ రెగ్యులర్ ఎఎల్‌ఒలను కేటాయించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లాలో రెగ్యూలర్ ఎఎల్‌వోలను, సూర్యాపేట, కోదాడకే కేటాయించాలని, భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ లేబర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మి తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు గంట నాగయ్య, దేశౌజు మధు మాట్లాడుతూ జిల్లాలో గత నాలుగు సంవత్సరాల నుండి భవన నిర్మాణ కార్మికుల క్లయిమ్‌లు అనేకం పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని పరిష్కరించడంలో రెగ్యూలర్ ఎఎల్‌ఓవోలు లేకపోవడంతో ఆలస్యం అవుతుందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర లేబర్ అధికారులు రెగ్యూలర్ ఎఎల్‌వోను కేటాయించాలని కోరారు. 2020 నుండి భవన నిర్మాణ కార్మికుల వివిధ క్లయిమ్‌ల కోసం ఆప్లై చేసుకున్నారు. ఆప్లై చేసుకొని సంవత్సరాలుగా కావోస్తున్న వాటిని పరిష్కరించడంలో ఆలస్యం అవుతుందని అన్నారు. దీంతో కార్మికులు డబ్బులు ఎప్పుడు పడతాయోనని ఎదురు చేస్తున్నారని అన్నారు. నిర్ధిష్టంగా సూర్యాపేట జిల్లాలో ఎన్ని క్లయిమ్‌లు పెండింగ్ ఉన్నావో వాటిని గుర్తించి ఆ వివరాలు ఆఫీసుల ముందు ప్రదర్శించాలని కోరారు. వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని తెలియజేశారు. పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను పరిష్కరించాలని కోరారు. కొత్త లేబర్ కార్డు కోసం ఆప్లై చేసుకున్న వారికి వారి కార్డులతో ఫోటోలు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సైదులు, పురుషోత్తం, కళ్యాణ్, నాగరాజు, లింగమల్లు పాల్గొన్నారు.

## క్రీడలు ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తాయి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** క్రీడలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తాయని మాస్టర్ శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని బీసీ భవన్‌లో కరాటే, జూడో సబ్ జూనియర్ పోటీలు జిల్లా వైస్ ప్రెసిడెంట్ మాస్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జూడో జిల్లా సెక్రటరీ ఎస్‌కె.పర్వేజ్, బీసీ సంఘం నేతలు మారం శ్రీనివాస్, బీసీ జేఏసీ కన్వీనర్ దాసరాజు జయరాజు, కోకన్వీనర్ చేగొండి మురళీయాదవ్, బీసీ జేఏసీ కోకన్వీనర్ ఉమాశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





## పెన్షన్‌ను విడుదల చేయాలి

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని కక్కిరేణి గ్రామంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పీఆర్‌డీ గ్రామ కమిటీ సమావేశంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్‌ను వెంటనే విడుదల చేయాలని అన్నారు. అర్హులైన వికలాంగులకు పెండింగ్‌లో ఉన్న పెన్షన్‌ను అందించాలని, ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 2011 నుంచి ఇప్పటివరకు రూ.3వేల పెన్షన్ ఇవ్వడం దుర్మార్గమని రూ.5వేలకు పెంచాలన్నారు. వికలాంగులకు నిరుద్యోగ భృతి రూ.3వేలు అందించాలని, ఇందిరమ్మ ఇండ్లలో ఐదుశాతం అందించాలన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. లేనిపక్షంలో వికలాంగులను సమీకరించి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో పిట్ట శ్రీనివాస్‌రెడ్డి, కన్నెబోయిన మంగమ్మ, చిల్లా రమాదేవి, బాషని పెద్ద సత్తయ్య, కన్నెబోయిన లింగయ్య, మంజుల, మహేష్, యాదయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ల కోసం చలో ఢిల్లీ



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను విద్యా, ఉద్యోగాలు స్థానిక సంస్థల్లో కల్పించడం కోసం తలపెట్టిన బిల్లు కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని కోరుతూ ముఖ్యమంత్రితో సహా క్యాబినేట్ మంత్రులు, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు అందరు కలిసి ఛలో ఢిల్లీ కార్యక్రమానికి త్వరలో వెల్లనున్నట్లు గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. రిజర్వేషన్ల బిల్లు జాప్యంపై 5వ తేదిన పార్లమెంట్‌లో పార్టీ ఎంపిల ద్వారా వాయిదా తీర్మాణం, 6న ఛలో ఢిల్లీ నిర్వహించి, జంతర్‌మంతర్ వద్ద ధర్నా, 7వ తేదిన బిసి సంఘాలతో కలిసి రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, టిపిసిసి సభ్యుడు డా. వేణుధర్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, ఆలయ చైర్మన్ నాయిని మాధవరెడ్డి, మండల అధ్యక్షుడు ఊట్కురి వేమన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కైసర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవార్లకు వడిబియ్యం

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** శ్రావణమాసాన్ని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా కేంద్రంలో శ్రీ సంతోషిమాత దేవాలయంలో శ్రీ వాసవి సేవా సమితి మహిళ సంఘం ఆధ్వర్యంలో గురువారం దేవాలయంలో వేంచేసి ఉన్న మూలవిరాట్ శ్రీ మానసదేవి అమ్మవారికి , లలితామాతలకు మహిళలు పెద్ద ఎత్తున ఒడి బియ్యం పోసి పసుపుకుంకుమలతో సంతోషంగా ఉండాలని కోరుతూ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు కీర్తిస్తూ పాటలు పాడారు. శ్రీ వాసవి సేవా సమితి మహిళ సంఘం నాయకులు వీరవెల్లి ఉమ మాట్లాడుతూ ప్రతినెల ఒక రోజు సూర్యాపేటలో వేంచేసి ఉన్న పలు దేవాలయాల్లో అమ్మవార్లకు ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవాలయ అర్చకులు బట్టారం వంశి కృష్ణ వర్మ ఆద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీ వాసవి సేవా సమితి భక్తులు గుండా సుధారాణి, కక్కిరేణి పద్మ, బెలిదె అశోక లక్ష్మి , బ్రహ్మదేవర సరస్వతి, మీలా శ్రీదేవి, బచ్చు పద్మావతి, సువర్ణ, వరగాని శారధ, కుక్కడపు ధనలక్ష్మి , నంద్యాల స్వాతి, గన్నవరపు గీత, పబ్బతి పద్మావతి పాల్గొన్నారు.





## హోంగార్డు కూతురు ఉషశ్రీని అభినందించిన జిల్లా ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్ నందు హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న నాగయ్య కుమార్తె ఉషశ్రీ ఇంటర్మీడియట్ నందు మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణత పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి కె.నర్సింహా సంక్షేమంలో భాగంగా నగదు బహుమతి అందించారు. భవిష్యత్‌లో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కష్టపడి చదువుకోవాలని క్రమశిక్షణగా ఉండాలని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్‌రెడ్డి, ఎఆర్ అదనపు ఎస్‌పి జనార్ధన్‌రెడ్డి, డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ హరిబాబు, ఆర్‌ఎస్‌ఐలు అశోక్, సాయిరాం, పోలీస్ సంఘం అధ్యక్షులు రామచందర్, వెంకన్న పాల్గొన్నారు.

## హార్ట్ ఫుల్ నెస్ హెల్ప్ ప్రోగ్రాం సద్వినియోగం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మూడు రోజుల హార్ట్ ఫుల్ నెస్ హెల్ప్ ప్రోగ్రామ్ యోగాను సద్వినియోగం చేసుకోవాలని గురువారం సంస్థ నిర్వాహకులు ఇంటర్మీడియట్ విద్యార్థులను కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే ఈ కార్యక్రమాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న 130 మంది విద్యార్థులకు యోగ విశిష్టత దాని ప్రయోజనాలు వివరిస్తున్నారు. యోగా చేయటం వల్ల విద్యార్థులకు శారీరక మానసిక మానసికంగా ఆరోగ్యంగా ఉండి మెదడు యొక్క పనితీరును మెరుగుపరచడమే కాక జ్ఞాపక శక్తిని ఉద్వేగాలను సమతుల్యం చేయడంలో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ టీం ప్రిసిప్టర్స్ అనిల్, సోమేశ్వరి కాలేజీ ప్రిన్సిపల్ సిసి రాజా రమేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక మండపానికి భూమిపూజ

**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూరు మండలంలోని కాటేపల్లిలో ఏకదంతా యూత్ అసోసియేషన్ శాశ్వత వినాయక మండపం ఏర్పాటుకు ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్ భూమి పూజ చేశారు. మండపానికి పచ్చిమట్ల మదార్ గౌడ్ తన స్వంత స్థలాన్ని రేకుల షెడ్డును తన సొంత పైసలతో నిర్మిస్తున్నందున ఏకదంతా ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో మోత్కూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పచ్చిమట్ల శ్రీనివాస్, పడకంటి అరుణాచారి, పచ్చిమట్ల బాబు, ఏనుగు సుదర్శన్ రెడ్డి, కోల పరశురాములు, భీమేష్, స్వామి, రాజిరెడ్డి, విష్ణు, సత్యనారాయణ, చంటి, మనమ్మ, ఉప్పమ్మ, ఏకదంతా యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి వెంకటరెడ్డిని కలిసిన నూతన గ్రంథాలయ చైర్మన్

**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఇటీవల నియమితులైన డాక్టర్ ఎంఎ ఆఫీస్ ఖాన్ గురువారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్డు భవనాల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి గ్రంథాలయ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధి కి కృషి చేయాలని పాఠకులకు అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరిని ఆదుకుంటుందని అందులో భాగంగానే మైనార్టీ కి గ్రంథాలయ చైర్మన్‌గా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరు పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తూ జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.గ్రంథాలయ చైర్మన్



డాక్టర్ ఎంఎ ఆఫీస్ ఖాన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ గ్రంథాలయల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. అదేవిధంగా తన ఎన్నికకు సహకరించి న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో పాటు ఇతర సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ జూపూడి రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## పదవీ విరమణ వయస్సుకే మనస్సుకు కాదు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పదవీ విరమణ కేవలం వయస్సుకేనని మనస్సుకు కాదని, పదవి విరమణ పొందిన ఉద్యోగులు సమాజ సేవకు ముందుకు రావాలని విద్యుత్ డీఈ శ్రీనివాసచారి, ఏడీఈ కోడిరెక్క రవికుమార్‌లు అన్నారు. గురువారం లైన్‌మెన్ పగిడి పుల్లయ్య వెంకటమ్మ పదవి విరమణ కార్యక్రమం విద్యుత్ బీసీ సంఘం డివిజన్ అధ్యక్షుడు బచ్చ రామచందర్ అధ్యక్షతన నిర్వహించగా వారు పాల్గొని లైన్‌మెన్ పుల్లయ్యను ఉద్యోగులు ఘనంగా సన్మానించి మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించి వినియోగదారుల మన్ననలను పొందాలన్నారు. ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రావు, టూటౌన్ ఏఈ రవీందర్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మారం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వైవి.గిరి, డివిజన్ ప్రధాన కార్యదర్శి రాచకొండ వెంకన్న, చంద్రశేఖర్, గంజి పాండురంగ, హరికిషన్, కొండలు, పుల్లయ్య, షఫి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన హక్కులను విస్మరిస్తున్న కేంద్రం

**ప్రజాపక్షం/తుంగతుర్తి:** గిరిజన హక్కులను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తుందని తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రాజరామ్ విమర్శించారు. గురువారం తెలంగాణ గిరిజన సమాఖ్య తుంగతుర్తి నియోజకవర్గ సమావేశం పద్మశాలి భవన్‌లో గిరిజన సమాఖ్య నాయకులు గుగులోతు నరేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజారామ్ మాట్లాడుతూ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి గిరిజనులకు రావాల్సిన వాటను కొల్లగోడుతున్నారని అన్నారు. అదే విధంగా తండాలను గ్రామ పంచాయతీ చేసినప్పటికీ పూర్తిస్థాయిలో నిధులు కేటాయించడం వివక్ష చూపిస్తున్నారని, దామాషా ప్రకారం జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్టీ, ఎస్టి బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, గిరిజన గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను



పరిష్కరించేందుకు గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో పోరాటాలలో ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బి.ప్రతాప్, నాయకులు నరేష్, ఇస్లావత్ భాస్కర్, జటోతు పవన్, సురేందర్, శ్రీను పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక :** నూతన కమిటి ఎన్నిక అధ్యక్షులుగా గుగులోతు నరేష్, ఉపాధ్యక్షులుగా సతీష్, ప్రధాన కార్యదర్శిగా బాణోతు ప్రతాప్, ఇస్లావత్ మనోజ్; సహాయ కార్యదర్శులుగా గుగులోతు భాస్కర్, కోశాధికారిగా జాటోతు పవన్, కార్యవర్గ సభ్యులుగా ఇస్లావత్ రాజు, సురేందర్, వెంకన్న, శంకర్‌లను ఎన్నుకున్నారు.

## బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని చౌటుప్పల్ పోలీస్ ఇన్స్పెక్టర్ మన్మథ కుమార్ అన్నారు. కొందరు గుట్టుగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు గురువారం చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లోని లక్కారం, మండలంలోని దేవాలమ్మ నాగారం గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా లక్కారం లోని సిరి కిరాణా జనరల్ స్టోర్ అక్రమంగా నిల్వ ఉంచిన 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారని, అలాగే డి నాగారం గ్రామంలో కోయగూర వెంకటేష్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన



16 మద్యం బాటిళ్లను, 3 బీర్ బాటిళ్లను స్వాధీన పరచుకుని నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులను నిర్వహిస్తున్న ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు పోలీస్ ఇన్స్పెక్టర్ జి.మన్మథ కుమార్ తెలిపారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ నియోజకవర్గం పరధిలోని కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హుజూర్‌నగర్ సీఐ జి.చరమందరాజు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని సర్కిల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జున సాగర్ డ్యాం గేట్లు ఎత్తడంతో నీటి ప్రవాహం అతివేగంతో దిగువ ప్రాంతాలకు రావడం జరుగుతుందని, హుజూర్‌నగర్ నియోజకవర్గం లోని పాలకవీడు,మఠంపల్లి,చింతలపాలెం మండాలలలో కృష్ణానదికి ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు వెంటనే సురక్షితమైన ప్రాంతాలకు వెళ్ళాలని సూచించారు. పశువులను మేపడం కోసం,వ్యవసాయ మోటార్ల కోసం,చేపలవేట కోసం ఎవరు కూడా వెళ్ళవద్దన్నారు. అధికారుల సమాచారం సూచనల మేరకు 100కు ఫోన్ చేసి అధికారుల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## రోడ్డు మరమ్మతులు చేయించాలి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** రామన్నపేట నుంచి కక్కిరేణి వరకు గుంతలమయంగా ఉన్న రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య అన్నారు. గురువారం గ్రామంలో పలు సమస్యలను పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, మొదటి ప్రాధాన్యతలో వికలాంగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. 8వ వార్డులో సీసీ రోడ్డు వేసిన దానిపై నీళ్లు నిలుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని నీటి నిల్వలో దోమలకు నిలయంగా మారిందని, దీంతో ప్రజలు పలు రోగాలకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు వేముల సైదులు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్, సీపీఎం గ్రామ కార్యదర్శి కన్నెబోయిన యాదయ్య, ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్, బాలకృష్ణ, రమాదేవి, రాములు, నరసింహా, శివ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాణి విద్యాలయానికి నూతన బస్సు అందజేత

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భువనగిరి పట్టణంలోని స్థానిక విద్యానగర్ పరిధిలోని శ్రీవాణి విద్యాలయం ప్రైవేటు పాఠశాలలో పిన్నపురెడ్డి శ్రీధర్ రెడ్డి, కంట్రోల్ ఎస్ డాటా సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ ఫౌండర్ వీరు గతంలో శ్రీవాణి విద్యాలయంనందు విద్యభ్యాసం పూర్తి చేసి ఉన్నత స్థాయికి వెళ్ళి కంట్రోల్ ఎస్ డాటా సెంటర్ సంస్థను ఏర్పాటు చేశారు. గొప్ప సంకల్పంతో రూ.24 లక్షల విలువగల నూతన బస్సుని శ్రీవాణి విద్యాలయానికి వారి తండ్రి గారైన పిన్నపురెడ్డి మోహన్ రెడ్డిచేతుల మీదుగా శ్రీవాణి విద్యా సమితి అధ్యక్షులు పులిమామిడి బాలకృష్ణారెడ్డికి అందజేశారు. అనంతరం పాఠశాల అభివృద్ధి కొరకై వివేరా హోటల్స్ రిసార్ట్స్ అధినేత రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు, శ్రీ సద్ది వెంకట్ రెడ్డి ఒక రూ.లక్ష అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణి విద్యాలయం హై స్కూల్ ఇంగ్లీష్ మీడియం, ప్రిన్సిపాల్ పులుగం నరసింహారెడ్డి, ఆర్ఎస్ ప్రసాదరావు, డైరెక్టర్ కంట్రోల్ ఎస్ డాటా సెంటర్, పాఠశాల కన్వీనర్ మరియు కోశా ధికారి బొక్క మాధవ రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ మంచికంటి వెంకటేశం, శ్రీవాణి విద్యా సమితి డైరెక్టర్లు కన్నయ్య, సోమిరెడ్డి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.





## జయజయ శ్రీ సుదర్శన చక్రరాజం నమో నమామి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం సుదర్శన జయంతిని పురస్కరించుకుని సుదర్శన భగవానునికి పంచామృత తిరుమంజన స్నపనం ఆలయ ప్రధాన అర్చకులు నల్లం చక్రవర్తుల వేణుగోపాలచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి అష్టోతర శతనామార్చన పూజ కార్యక్రమాలు నిర్వహించి అత్యంత మహిమాన్వితమైన శ్రీ సుదర్శన శతక, మూల మంత్రముల చేతశ్రీ సుదర్శన యాగం నిర్వహించారు. మహాపూర్ణ హుతి నిర్వహించి, శ్రీ సుదర్శన వైభవాన్ని భక్తులకు తెలిపారు. విష్ణుమూర్తికి కలిగిన పంచ ఆయుధాలతో శ్రీ సుదర్శన చక్రం అత్యంత మహిమాన్వితమైనదని అన్నారు. ఆండాళ్ గోష్టి మహిళ భక్తబృందం అధిక సంఖ్యలో పాల్గొని భక్తులు సుదర్శన భగవానునికి జయ జయ ధ్యనాలు పలికారు.

## ఇసుక సరఫరాపై సమీక్ష



**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇసుకను అందించేందుకు గురువారం డిండి తహశీల్దార్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ఉచిత ఇసుక విధానంపై కందుకూరు, వావిలికోల్, దాసరినెమలిపూర్ గ్రామాలకు సంబంధించిన ట్రాక్టర్ యజమానులతో ఎస్ఐ బాలకృష్ణతో కలిసి తహశీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా రవాణా చేయుచున్న ట్రాక్టర్ యజమానులు ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని లబ్దిదారులల వద్ద అధిక డబ్బులు వసూలు చేయకుండా ఇసుక రవాణా చేయాలని సూచించారు.

## చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సు విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నేడు పట్టణంలో నిర్వహించే చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు ఎండి.అహ్మద్‌ఖాన్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ, పోలీట్ బ్యూరో సభ్యుడు దైద సత్యంలు ఈ సదస్సుకు హాజరు కానున్నందున దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సైదులు, మదన్‌నాయక్, అప్సర్, శ్రీను, విజయ్, సామ మధు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## చేయూత పెన్షన్‌దారుల మహాగర్జన విజయవంతం



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** ఆగస్టు 13న హైదరాబాద్‌లో జరిగే చేయూత పెన్షన్ దారుల మహాగర్జన ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు నల్ల చంద్రస్వామి కోరారు. మండల కేంద్రంలో జరిగిన వికలాంగుల, వృద్ధుల, వితంతువుల, వికలాంగుల, చేయూత పెన్షన్ దారుల చైతన్య మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మార్పీయస్ రాష్ట్ర నాయకులు ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం మాదిగల కోసమే ఏర్పడిన అనేక సామాజిక సమస్యల మీద పోరాటం చేస్తూ అన్ని వర్గాల ప్రజల పక్షాన నిలబడిందని అన్నారు. అందులో భాగంగానే ఆరోగ్యశ్రీ పథకం, వికలాంగులు, వృద్దులు, వితంతువులు ఇతర పెన్షన్ దారుల పెన్షన్లు పెంచాలని పోరాడి విజయం సాధించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పియస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, మండల నాయకులు మందుల లింగ స్వామి మాదిగ, వికలాంగుల హక్కుల పోరాట సమితి (విఎచ్‌పియస్) మండల నాయకులు వెంకట్ రెడ్డి, వృద్ధుల సంఘం నాయకులు గట్టు రాములు మాదిగ, మధు సూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎరుకల సంఘ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** ఆగస్టు 3 న హైదరాబాద్‌లో ఎరుకల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే 29వ ఆవిర్భావ దినోత్సవానికి తెలంగాణ రాష్ట్ర ములోని ఎరుకల కులస్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు, నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్షల భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మొట్ట మొదటి ఆదివాసి బిడ్డలవారసులం, భూమి పుత్రులమైన ఎరుకల జాతికి గౌరవ గుర్తింపు దక్కడంలేదని, రాజకీయంగా అగ్రకులాలు అణగదొక్కుతున్న తరుణంలో ప్రతి ఒక్క ఎరుకల బిడ్డ మేల్కోవాల్సిన పరిస్థితి ఏర్పడ్డదని ఆయన తెలిపారు. అలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితీ ఆధ్వర్యంలో చేసిన ఉద్యమాలలో ఎనోన్న విజయాలను సాధించిందని



ఈసందర్బంగా ఆయన గుర్తుచేశారు.కావున ఆగస్టు 3 న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం , బాగ్‌లింగంపల్లి లో ఎరుకల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే 29వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమమునకు ఎరుకలులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా భాస్కర్ కోరారు.

## నూతన ఎక్సైజ్ పాలసీ విధానాన్ని అమలు చేయొద్దు



**ప్రజాపక్షం/చండూరు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తేవాలనుకుంటున్న నూతన మద్యం పాలసీ విధానాన్ని విరమించుకోవాలని డిమండ్ చేస్తూ బిజెపి మున్సిపల్ అధ్యక్షుడు పందుల సత్యం గౌడ్ అధ్వర్యంలో గురువారం చండూరులో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ బెల్లకొండ స్వాతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు బిజెపినాయకులు మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో 2620 మద్యం దుకాణాలకు టెండర్లు ద్వర పోటీ తత్వాన్ని పెంచి సుమారు లక్ష 25వేల టెండర్లు వేయించి 2500కోట్లు ఆదాయం వచ్చినట్లు ప్రకటించి టెండర్ల ద్వారనే మద్యతరగతి వారిని దోచుకుందని ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి రెట్టింపు మోసంతో ఇప్పుడు కాంగ్రేస్ ప్రభుత్వం ప్రజల మద్యం తాగుడును మూడింతలు చేసే ప్రయత్నంలో ఉందన్నారు. తెలంగాణ ఎక్సైజ్ లో సమూల మార్పులు తెలంగాణ ప్రజల ఆరోగ్యం పనంగా పెట్టి ఎక్సైజ్ శాఖ ఆదాయ మార్గాన్ని ఎంచుకుందని ఆరోపించారు. నూతన ఎక్సైజ్ విధానాన్ని విరమించుకోకపోతే బిజెపి ఆద్వర్యంలో ఆందోళనకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు కోమటి వీరేశం , భూతరాజు శ్రీహరి, అన్నెపర్తి యాదగిరి, బోడ ఆంజనేయులు , సామ వెంకట్‌రెడ్డి , సోమ శంకర్ , పల్లెగోని చంద్రమౌళి, చెనగాని శేఖర్ , మంచుకొండ సాగర్ , కారింగు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని దామేర భీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం పాఠశాల ఆవరణంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి బిట్టు శ్రీను, ప్రధానోపాధ్యాయులు ఉదావత్ లచ్చిరాం మరియు ఉపాధ్యాయులు మంజులత, సభావత్ వెంకట్ కుమార్ నాయక్,



కొండ శ్రీనివాస్, మీనా మరియు విద్యార్థులతో కలిసి కూరగాయల విత్తనాలను నాటారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి బిట్టు శ్రీను ప్రధానోపాధ్యాయులు ఉదావత్ లచ్చిరాం మాట్లాడుతూ... పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంలో మంచి పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశామని, గార్డెన్ లో పండే కూరగాయల ను మధ్యాహ్నం భోజనానికి వాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## 13న పెన్షన్ దారుల జిల్లా మహాసభ

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామిలను అమలు చేయడంలో విఫలమైనందున ఆగస్టు 13న హైదరాబాద్‌లో నిర్వహించే మహాసభను విజయవంతం చేయడానికి మిర్యాలగూడలో ఆగస్టు 1జరిగే సభకు ప్రతి పెన్షన్‌దారుడు హాజరుకావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్ మాదిగ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామి ప్రకారం వికలాంగులకు రూ 6000, వృద్ధులు, వితంతువు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడి కార్మికులతో పాటు అన్ని రకాల చేయుత పెన్షన్లను రూ.4000 పెంచాలని డిమాండ్ చేస్తూ మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఆగస్టు 13న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో పెన్షన్‌దారుల మహాగర్జనను విజయవంతం చేయడానికై ఆగస్టు 1న మిర్యాలగూడలో చేయూత పెన్షన్ దారుల జిల్లా మహాసభను నిర్వహిస్తున్నందున వికలాంగులు, పెన్షన్ దారులు అధిక సంఖ్యలో పాల్గొని సభ విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

## నీలి నాలుక వ్యాధి టీకాలు



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని గంగాపురం గ్రామంలో గురువారం పశువైద్య మరియు పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు, మేకలకు ఉచితంగా నీలి నాలుక వ్యాధి టీకాలు ఇవ్వడం జరిగిందని మండల పశువైద్యాధికారి డా. యాకుబ్ తెలిపారు. సుమారు 1600 జీవాలకు టీకాలు అందించడం జరిగిందని తెలిపారు. టీకాలు వేయించడం ద్వారా జీవాలకు ఎటువంటి వ్యాధులు సోకకుండా వ్యాది నిరోదక శక్తి పెరిగి జీవాలు ఆరోగ్యంగా ఉంటాయని అన్నారు. రైతులు వారి యొక్క జీవాలకు నీలి నాలుక టీకాలను వేయించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో గోపాలమిత్రలు గోవింద్, కృష్ణ ,శ్రీను, నరేష్, గోర్ల కాపరులు పాల్గొన్నారు.

## జాతీయ నాయకుల చిత్రపటాల బహుకరణ



**ప్రజాపక్షం/నల్లగొండ(నకిరేకల్) :** మండలంలోని తాటికల్ ఉన్నత పాఠశాలకు కస్తూరి ఫౌండేషన్ వారు జాతీయ నాయకుల చిత్రపటాలను బహుకరించారు. కస్తూరి ఫౌండేషన్ తరపున పిఆర్‌టియు నకిరేకల్ మండల గౌరవ అధ్యక్షురాలు కడారి అనిత ఆధ్వర్యంలో మండల విద్యాధికారి తాటికల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేక నాగయ్య కు జాతీయ నాయకుల చిత్రపటాలను బహుకరించారు. ఈ సందర్భంగా గురువారం ఉద్యోగ విరమణ చేస్తున్న అనితను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న, పందుగ తిరుమలయ్య, మోసంగి హరీష్ చంద్ర, మార్త రాములు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి, లొట్లపల్లి కోటయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూలులో అడ్మిషన్లకు దరఖాస్తులు

**ప్రజాపక్ష/వేములపల్లి:** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్,కాలేజీలో ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు బైపిసి,సిఇసి, ఎంపీసీ గ్రూపులలో మిగిలిన సీట్ల కోసం దరఖాస్తులు కు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దీనా సుజాత తెలిపారు.

## తల్లిపాల వారోత్సవాల నిర్వహణకు పకడ్బందీ కార్యాచరణ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రపంచ తల్లిపా వారోత్సవాలకు పకడ్బందీగా కార్యాచరణ రూపొందించినట్లు సీడీపీవో మమత అన్నారు. గురువారం ఆమె స్థానికంగా మాట్లాడుతూ నేటి నుంచి 7వరకు బిడ్డకు పాలిచ్చే, తినే పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆగ సుట 1న మండల, సెక్టార్ స్థాయి అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలకు అవగాహన కల్పిస్తామన్నారు. అన్నప్రాసనపై అవగాహన, ఆరు నెలలోపు బిడ్డ లకు సరైన సమయంలో అనుబంధ ఆహారం, రెండు సంవత్సరాల పిల్లలకు అనుబంధ ఆహా రాన్ని కొనసాగించడం వంటి వాటిపై అవగా హన కల్పిస్తామన్నారు. ఇంటింటికి తిరిగి అంగ న్‌వాడి కౌన్సిలింగ్ పుస్తకం ద్వారా ప్రతి రోజు ఇంటి సందర్శనలు ఉంటాయన్నారు.

## రాష్ట్ర సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్‌ను కలిసిన కేశవులు



**ప్రజాపక్షం/చండూరు:** తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డిని గురువారం సమాచార హక్కు పరిరక్షణ సమితీ,ఎల క్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డా. బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ మర్యా దపూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలిపారు. సమా చార హక్కు పరిరక్షణ సమితీ సంస్థ ,ఎల క్షన్ వాచ్ కమిటీ ద్వారా చేస్తున్న సేవలను డా. జి. చంద్రశేఖర్ రెడ్డి కి వివరించారు. సమాచార హక్కు చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న సమాచార హక్కు పరిరక్షణ సమితీ,ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డా. బొమ్మరబోయిన కేశ వులును , కమిటీ సభ్యులను చీఫ్ కమిష నర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మేకల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** పట్టణంలోని గురిజ అశోక్ స్వామి నూతనంగా నిర్మించిన ఆలయంలో అత్యంత భక్తి శ్రద్ధలతో యంత్ర స్థాపన కార్యక్రమంను నిర్వహించారు. అనం తరం ఎల్లమ్మ దేవి, కాళీమాత దేవి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. అనం తరం ఎల్లమ్మదేవి, కాళీమాత దేవి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ప్రతిష్ట కార్యక్రమం లో భాగంగా 30 అడుగుల రాత్రి ధ్వజస్థంభం ప్రతిష్టించే సమయంలో భక్తుల తన్మ తయత్వంతో ఎల్లమ్మ తల్లి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ప్రతిష్ట కార్యక్ర మాలు పూర్తయిన తర్వాత రేణుక ఎల్లమ్మజమదగ్ని మునిరాజుల శాంతి కళ్యాణం శతాధిక ప్రతి ష్టాచార్యులు బేతోజు సత్యనారాయణ శాస్త్రి చేతుల మీదుగా అట్ట హసంగా నిర్వహించారు. ఈసందర్భంలో లోక కళ్యాణార్థం గోవుకు వృషభానికి కళ్యాణం జరిపించారు.

## నేత్రదాతల చిత్రపటాలకు నివాళి



**ప్రజా పక్షం /నల్లగొండ టౌన్ :**2024 ఆగస్టు 1న ప్రారంభమైన నేత్రదాన కార్య క్రమం ఇప్పటివరకు 157 మంది నుంచి నేత్రాలను సేకరించి 300 మందికి కంటి చూపు అందించడం జరిగిందని లయన్స్ క్లబ్ ఆఫ్ చారిటబుల్ ట్రస్ట్, ఐ డొనేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ పుల్లారావు, డాక్టర్ హరినాథ్ లు తెలిపారు. గురువారం నల్లగొండలోని లైయన్స్ భవన్లో నేత్రాలు దానం చేసిన నేత్ర దాతల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదేవిధంగా నేత్ర దానం గురించి ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జర్నలిస్టులను లైయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్, ఐ డొనేషన్ సెంటర్ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానిం చారు. లైయన్స్ క్లబ్ సభ్యులు ఏచూరి శైలజ, చిరునోము ల చంద్రశేఖర్, డాక్టర్ దామర యాదయ్య, జర్నలిస్టులు తెలుగుమళ్ల దశరథ, పేరం సుభాష్, ముచ్చర్ల విజయ్,భజరంగ్ ప్రసాద్, మేడి వినోద్, మధు, బాలరాజు, శంకర్ తదితరులున్నారు.

## స్థానిక సమరంలో సత్తా చాటుతాం

**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం**



**ప్రజాపక్షం/పాల్వంచ :** అశ్వారావుపేటలో జూలై 26,27వ, తేదీలలో జరిగిన సిపిఐ జిల్లా మూడవ మహా సభలో పాల్వంచకు తగిన గుర్తింపు దక్కిందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. స్థానిక చంద్రా రాజేశ్వరరావు భవ న్‌లో గురువారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సంధ ర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ ..సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్య లుగా ముత్యాల విశ్వనాథం, ఉప్పుశెట్టి రాహుల్, అడుసుమిల్లి సాయి బాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు లను, కౌన్సిల్ సభ్యులుగా బండి నాగే శ్వరరావు, గుండాల నాగరాజు, డి. సుధాకర్, వి. పద్మజ, వరక అజిత్, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకటరావులను ఏక గ్రీవంగా ఎన్నుకొన్నారని తెలిపారు. కేటిపిఎస్‌లో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నూతన ప్లాంట్, ఎరువుల కర్మాగారాలను, స్థానికులకే ఉపాధి కల్పించాలని, పాల్వంచ మున్సిపాలిటీకి కార్పోరేషన్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని, కాలుష్య ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయాలని, పట్టణ ప్రాంతంలో సైతం ఉపాధి హామీ పథకం వర్తింపజేయాలని, స్పాంజ్ ఐరన్ కర్మాగారంలో ఉత్పత్తి ప్రారం భించాలనే, పాల్వంచ కేంద్రం ఆటో నగర్ ఏర్పాటు తదితర 49 తీర్మానాలు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించినట్లు పేర్కొ న్నారు.మహాసభల స్ఫూర్తి తో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూనే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. పాల్వంచ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమ స్యలను ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు దృష్టికి తీసుకెళ్ళి శాశ్వత పరిష్కారానికై కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పు శెట్టి రాహుల్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బండి నాగేశ్వరరావు, గుండాల నాగరాజు, డి. సుధాకర్, వి. పద్మజ, వరక అజిత్, వీసంశెట్టి విశ్వేశ్వర రావు, నిమ్మల రాంబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారుల వేలిముద్రల చెకింగ్

**ప్రజాపక్షం/డిండి;** వేలిముద్రలు తీసే యంత్రం ద్వారా వెహికిల్ చెకింగ్‌లో నేరస్తులను , అను మానితులను గుర్తించి వారి వేలిముద్రల ద్వారా వారిపై పాత నేరాలకు సంబందించిన కేసులు నమోదయ్యాయో, అడ్రస్ చెక్ చేయడం రోజు జరుగుతుందని డిండి ఎస్ఐ సిహెచ్ బాలకృష్ణ గురువారం తెలిపారు.

## ప్రతీ పేదవాడి కలను సహకారం చేస్తాం : ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం పట్టణం పరిధిలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను, రేషన్‌కార్డులను వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్, వైరా మున్సిపాలిటీ 14వ వార్డు రైతువేదిక నందు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ సంక్షేమ పథకాన్ని ప్రతి పేదవా డికి అందించడంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముందంజలో ఉందని, ప్రతి పేదవాడి కలను నిజం చేస్తామని ఆయన అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కి బుద్ది చెప్పాలని తెలియజేస్తున్నా మని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, తహశీల్దార్ శ్రీని వాసరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, పొదిల హరినాథ్, బోళ్ళ గంగారావు, పమ్మి అశోక్, దార్న రాజశేఖర్, ఫణితి శ్రీను, వీరంశెట్టి సీతారాములు, కట్ల నాగరాజు, కట్ల సంతోష్, షేక్ సైదా, యన్నం వెంకటకోటారెడ్డి, భూక్యా రాముదు, పమ్మి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన సిఐగా వెంకటరెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాపక్షం/దేవరకొండ; దేవరకొండ పట్టణ నూతన సిఐగా గురువారం పోసిరెడ్డి వెంకటరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు తన వంతుగా కృషి చేస్తానని, ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. సైబర్ నేరాలు, మహి ళులు, చిన్నారులపై జరిగే నేరాల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు భద్రతా నిబంధనల అమ లుపై దృష్టి సారిస్తామని అన్నారు.

## జిల్లా స్థాయి యోగాసన ఎంపిక పోటీలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ యోగాసభ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం 6వ నల్లగొండ జిల్లా స్థాయి యోగసన ఎంపిక పోటీలు పట్టణం లో హార్టఫుల్నెస్ మెడిటేషన్ సెంటర్ ఫణి విహార్ లో జరిగాయి.ఇందులో జిల్లా నుండి 120 పైగా యోగసన క్రీడాకారులు పాల్గొన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్,మాస్టర్ విభాగం లో జరిగాయి, సీనియర్ లెవెల్ క్రీడాకారులు ఆగస్టు నెలలో 7 మరియు 8 న ఆదిలాబాద్ లో జరగబోయే రాష్ట్ర స్థాయి యోగ ఛాంపియన్షిప్ లో పాల్గొంటారు, సబ్ జూనియర్, మరియు సీనియర్ ప్లేయర్స్ సెప్టెంబర్ లో నిర్మల్ లో జరుగుతాయని రాష్ట్ర ప్రెసిడెంట్ కోట సింహాద్రి, జనరల్ సెక్రెటరీ రాయనబోయిన శ్రీను తెలిపారు.సబ్ జూనియర్ విభాగం లో మెడల్స్ పొందిన ప్లేయర్స్ టీ. సాయి .లిపి, వి వరలక్ష్మి, కే చిద్విలాస్య. సబ్ జూనియర్ విభాగం లో టీ ఆమన్. శ్రీహాస్ రావు. కే అభిరామ్. పి స్రుజన్ .జూనియర్ విభాగం లో కే సిరి .చంద్రిక. సీనియర్ విభాగం లో సమీరా .పి పావని. శిరీష .సీనియర్ బాయ్స్ విభాగం లో కే సోమా శేఖర్ ,మాస్టర్ విభాగం లో చైతలి, ఇందిరా, శిరీష ,మాస్టర్ మెన్ కే వెంకట రామ రావు ఈ కార్యక్రమం లో బోసం నాగిరెడ్డి , మంగ దంపతులు, సీనియర్ యోగ మాస్టర్ నామిరెడ్డి సుష్మ , పీడీ మహేశ్వరీ, సునీత, శ్రీనివాసులు పాల్గొని విజేతలకి మెడల్స్,సర్టిఫికెట్స్ అందచేశారు.



## చెడు అలవాట్లకు దూరం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని షీటీం ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం గురువారం స్థానిక కాకతీయ పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లా డారు. యువత చెడు అలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి ఆరోగ్యాలను, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నా రు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అనవసర లింక్‌లను క్లిక్ చేయవద్దని సూచించారు. కార్యక్ర మంలో ఏఎస్ఐలుఏ షరీఫ్, ప్రభాకర్, మహిళా కానిస్టేబుల్ రాజే శ్వరి, రవి, అయూబ్‌లు ఉన్నారు.



## కామ్రేడ్ పూనెం లింగన్న వర్ధంతి



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రతిఘటన పోరు కెరటం లింగన్నకు విప్లవ జోహార్లు అని సిపిఐ ఎంఎల్ న్యూడె మోక్రసీ నాయకులు, అరుణోదయ జిల్లా అధ్యక్షులు ఉదయగిరి అన్నారు. గురువారం కామ్రేడ్ లింగన్న ఆదివాసి గుడిసెల్లో ఉదయించిన అరుణ కిరణం అన్నారు. సమాజ మార్పుకై సాగే పోరాటంలో నేను సైతం అంటూ ప్రతిఘటన పోరాబాటలో కదిలిన వ్యక్తి అన్నారు. ఆదివాసిల హక్కుల కోసం, పోడు భూముల పరిరక్షణ కోసం ఇల్లందు ప్రాంతంలో పీడిత ప్రజల పక్షాన నిలిచిన పోరాడిన విప్లవ రణత రంగం లింగన్న అని అన్నారు. 2018 జూలై 31న గుండాల ప్రాంతంలో రోళ్లగడ్డలో ఆడవిలో పోలీసుల బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరత్వం చెందాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వక్కుంతుల నర్సింహారావు, విజయ్, పోకల మైసయ్య, రవితేజ, నర్సింహారావు, కొండలు, సలీం, ఖాసీం, చోటు, సాలమ్మ, వెంకన్న పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యంగా కార్యాచరణ

**-సంక్షేమ పథకాల అమలులో జాప్యం**
**-సిపిఐ మండల కౌన్సిల్ సమావేశంలో దండి సురేష్**






**ప్రజాపక్షం/ బోనకల్ :** రాష్ట్రంలో త్వరలో పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ లకు ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సూచించారు. స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ మిత్ర ధర్మాన్ని పాటించకపోతే స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం ఉంటుందని ఆయన అన్నారు. సిపిఐ బోనకల్ మండల కౌన్సిల్ సమావేశం గురువారం రాపల్లిలో మండల కార్యదర్శి వెంగళ ఆనందరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల గెలుపుతో గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసే అవకాశం దక్కుతుందని పార్టీ బలానికి అనుగుణంగా పోటీ చేయాలని ఆయన సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పొత్తులో ఉన్నామని ఆ పొత్తు ధర్మాన్ని పాటించి కాంగ్రెస్‌తో కలిసి పని చేస్తామని కాంగ్రెస్ మిత్ర ధర్మాన్ని పాటించకపోతే పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో జాప్యం జరుగుతుందని ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న విధంగా సంక్షేమ పథకాలను అమలు చేయాలని సురేష్ కోరారు. ముఖ్యంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా నెలకు రూ. 2500 మహిళల ఖాతాల్లో జమ చేయాలని అదేవిధంగా రైతుబీమా, పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సురేష్ డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు పార్టీ కార్యక్రమం తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. డిసెంబర్ 26న జరిగే పార్టీ శత వసంతాల ముగింపు వేడుకను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. శత వసంత ముగింపు సభ విజయవంతానికి గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా కార్యదర్శిగా ఎన్నికై తొలిసారి మండల కౌన్సిల్‌కు హాజరైన జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి సహా నూతన కమిటీ సభ్యులను గ్రామశాఖ ఘనంగా సన్మానించింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబు, ఏనుగు గాంధీ, ఎంఏ రహీం, జిల్లా కౌన్సిల్ సభ్యురాలు బత్తినేని నీరజ, తూము రోషన్‌కుమార్, రాపల్లి గ్రామశాఖ బాధ్యులు ఏనుగు రామకృష్ణ, ఏనుగు రవికుమార్, రాధాకృష్ణ, వేణు, మండల కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు అమరజీవి నల్లమల సత్యనారాయణ స్మారక స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# 'స్నేహ హస్తాలు' ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం కొణిజర్ల మండలంలోని తనికెళ్ల (హెచ్‌డబ్ల్యూ), చిన్నగోపతి యుపిఎస్ పాఠశాలలో విద్యార్థులకు రాత పుస్తకాలు, చిత్రలేఖనం పుస్తకాలు, ఇతర విద్యా సంబంధిత సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో డి. అబ్రహం మాట్లాడుతూ స్నేహ హస్తాలు ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఛైర్మన్ ఎంవిరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసిరెడ్డి రాంమోహన్‌రావు, వెంకటేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్‌కిడ్జ్‌లో దంత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన దంత వైద్య శిబిరంలో మమత దంత వైద్యులు విద్యార్థులకు వైద్యులు దంత పరీక్షలు నిర్వహించి దంత సంరక్షణ పట్ల అవగాహన కల్పించారు. వైద్యులు పలు సలహాలు, సూచనలు అందించారు. చాక్లెట్లు, ఇతర తినుబండారాలు తినడం వల్ల దంతాలకు హానీ జరుగుతుందని వైద్యులు తెలిపారు. ప్రతి రోజు ఉదయం దంతాలను పరిశుభ్రం చేసుకున్న తర్వాతనే ఏదైనా తినాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ శరీర ఆరోగ్యానికి దంత సంరక్షణ కీలకమన్నారు. చిన్నారులు దంతాల సంరక్షణకు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సుందరయ్యనగర్‌లో సమస్యలు పరిష్కరించాలని సంతకాల సేకరణ



**ప్రజాపక్షం/వైరా:** సుందరయ్యనగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్థంగా ఉంది. ఓపెన్ ప్లాట్లు అడవుల్లా మారిపోయి దోమలు, పందులు, విష సర్పాలకు ఆవాసాలుగా మారాయి. విరిగిపోయిన విద్యుత్ స్థంభాలు ప్రమాదకరంగా మారి ప్రజలు భయంతో జీవిస్తున్నారు. మంచినీటి పైపుల్లో మురుగు నీరు చేరుతుందని స్థానికులు ఆరోపించారు. విద్యుత్ స్థంభం పైభాగం విరిగిపోగా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఇలాంటి స్థంభాలు మిగిలిన ప్రాంతాల్లో కూడా పునరుద్దరించాలి. ఇళ్ల మధ్య ఉన్న మిడిల్ పోల్స్ తొలగించాలి. సర్వేలో వచ్చిన సమస్యలను మున్సిపాలిటీ కమీషనర్ వెంటనే గమనించి డ్రైనేజీ, విద్యుత్, పారిశుద్ధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, వార్డు అభివృద్ధికి కేటాయించిన నిధులను పారదర్శకంగా వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి నాగుల్ పాషా, మాజీ ఎంపిపి బొంతు సమత, శ్రీనివాసరావు, తోట కృష్ణవేణి, లక్ష్మి పాల్గొన్నారు.

# పాలస్తీనా సంఘీభావ ర్యాలీని జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అమెరికా అండతో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు నిరసనగా ఆగస్టు ఏడున ఖమ్మంలో పాలస్తీనా సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో జరిగే భారీ ర్యాలీని జయప్రదం చేయాలని యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. గురువారం సుందరయ్య భవన్‌లో జరిగిన యువజన సంఘాల ఉమ్మడి సమావేశంలో యువజన సంఘాల నేతలు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ గత కొంత కాలంగా పాలస్తీనాపై మారణహోమం సృష్టిస్తుందన్నారు. చిన్నారులు, వృద్ధులు అని చూడకుండా నర మేధానికి పాల్పడుతుందన్నారు. ప్రపంచ శాంతి వర్ధిల్లాలి యుద్ధం వద్దు శాంతి ముద్దు అనే నినాదంతో పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా పాలస్తీనా సంఘీభావ కమిటీ ఖమ్మం ఆధ్వర్యంలో ఆగస్టు ఏడున ఖమ్మంలో భారీ ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మద్దోజు శ్రావణ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, పివైఎల్ జిల్లా నాయకులు రవీందర్, బిఆర్ఎస్ యూత్ నాయకులు బలుసు మురళి, యూత్ కాంగ్రెస్ నాయకులు గంగాధర్, డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**మహిళా సంఘాల ఆధ్వర్యంలో ...**




పాలస్తీనా సంఘీభావ ర్యాలీని జయప్రదం చేయాలని వామపక్ష మహిళా సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఉమ్మడి సమావేశంలో మహిళా సంఘాల నేతలు మాట్లాడుతూ ఆగస్టు ఏడున ఖమ్మంలో జరిగే ర్యాలీలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఇజ్రాయిల్ మహిళలు, పసి పిల్లలనే లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం శోచనీయమని వెంటనే దాడులను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, ఐద్వా నాయకురాలు బుగ్గవీటి సరళ, పివోడబ్ల్యూ నాయకులు శోభ, వివిధ సంఘాల నేతలు సీతామహాలక్ష్మి, తాటి నిర్మల, ఝాన్సీ, పద్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వైరా:** ప్రభుత్వ ఉద్యోగులు సేవలు మరువలేనివని వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. గురువారం వైరాలో సాయిబాబా ఆలయ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వైరా ఎంపిడివో పిల్లి సరస్వతి, పంచాయతీ సెక్రటరీ చిట్టిపోతుల వెంకటేశ్వరరావు పదవీవిరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అధికారులు ప్రజలకు అందిస్తున్న సేవలు మరువలేనివని ఎన్నో సంవత్సరాలు ప్రజలకు సేవలు అందించిన అధికారులు పదవీవిరమణ అనంతరం ప్రశాంత వాతావరణంలో సంతోషకర జీవితం గడుపుతూ ఆరోగ్యంగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, పమ్మి అశోక్, కట్ల నాగరాజు, పలువురు తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు రిజిస్ట్రేషన్ గుర్తింపు

**కలెక్టర్ చేతికి ఆక్రమణల నివేదిక**






**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డు 98 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణలపై ప్రజాపక్షం దినపత్రిక వరుస కథనాలను ప్రచురించడం జరిగింది. ఈ వరుస కథనాలతో రెవిన్యూ అధికారులు జరిపిన విచారణలో వెలుగు చూసిన వాస్తవాలు చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకు అనుకుంటున్నారా, వైరా మున్సిపాలిటీ పరిధిలోని 98 సర్వే నెంబర్‌లో జరిగిన తప్పుడు రిజిస్ట్రేషన్‌పై ప్రజాపోం కథనం పూర్తిస్థాయిలో దొంగ 98 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమి ఉన్న మాట వాస్తవమే అని అధికారులు గుర్తించారు. భూమిని పెద్ద ఎత్తున ఆక్రమించుకున్నట్లు అధికారులు నిర్ధారించారు. 98 సర్వే నెంబర్‌లో సుమారు 41మంది ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని వివిధ మార్గాల్లో వాటిని రిజస్ట్రేషన్ చేయించి ఇంటి నెంబర్లు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. 98 సర్వే నెంబర్‌లో గుట్టతో పాటు సుమారు 41 మంది తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి వాటిని రిజిస్ట్రేషన్ చేసుకోవడాన్ని గుర్తించిన అధికారులు వారి పేర్లను ఎవరెవరు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారో అనే దానిని వివరాలను రెవిన్యూ అధికారులు జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి నివేదిక పంపించినట్లు సమాచారం. ఇప్పటికే 98 సర్వే నెంబర్ ఆక్రమణపై జిల్లా కలెక్టర్ ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. గుట్టపై ఆర్‌డివో విచారణ చేసి పూర్తి సమాచారం కావాలని ఆదేశించడంతో అధికారులు నివేదికను తయారు చేసి పంపించారు. 98 సర్వే నెంబర్‌లో రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని కూడా దానికి సంబంధించిన వివరాలను ఇప్పటికే వైరా సబ్ రిజిస్టర్ ఆఫీస్‌కి పంపించడం కూడా జరిగింది. అదేవిధంగా వైరా మున్సిపాలిటీలో ఇంటి నెంబర్‌లు ప్రభుత్వ భూముల్లో ఎవరెవరికి ఇచ్చారు ఏ విధంగా ఇచ్చారు అన్న దానిపై కూడా అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. ఇప్పటికే కోట్ల రూపాయల ప్రభుత్వ భూమి ఆక్రమణదారుల చేతుల్లో బందీ అయి ఉందని గుర్తించారు. కాంగ్రేస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ భూముల రక్షణ కోసం ప్రత్యేకంగా కంకణం కట్టుకోవడంతో ఆక్రమణ భూములపై అధికారులు అదేనా పరచుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# ఆదర్శప్రాయుడు పూనెం లింగన్న



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** చిన్న వయస్సు నుంచే కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులై దోపిడిదారులకు, పెత్తందారులకు వ్యతిరేకంగా ఆదివాసీల అటవీ సంపద కోసం అలుపెరగని పోరాటం చేసి అమరుడైన దళ కమాండర్ పూణేం లింగన్న ఆదర్శప్రాయుడని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ అన్నారు. పూణేం లింగన్న ఆరవ వర్థంతి సందర్భంగా మండల పరిధిలోని బచ్చోడు గ్రామంలో మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ అధ్యక్షతన గురువారం జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల కోసం, పోడు భూమి సాగుదారుల కోసం, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేశారని, బూటకపు ఎన్కౌంటర్లో మృతి చెందిన లింగన్న ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు గొర్రెపాటి వీరస్వామి, ఆడెపు నగేష్, బింగి శ్రీను, సకినాల వెంకన్న, రామకృష్ణ, సంజీవ, ఎన్నబోయిన ఉప్పయ్య తదితరులు ఆపల్గొన్నారు.